


చీనీ టన్ను రూ.31 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.31 వేలు పలికాయి.



నేడు 'దిశ' సమావేశం

'దిశ' సమావేశం బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు.

గరిష్టం/కనిష్టం
37.2°/24.4°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి.ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

యూజీ, పీజీ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్కేయూ,ఆర్ట్స్ కళాశాల అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల యూజీ, యూజీ ఆనర్స్, పీజీ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. గత ఏప్రిల్, మే మాసాల్లో జరిగిన మెగా సప్లిమెంటరీ, డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, ఆనర్స్, 7వ సెమిస్టర్, పీజీ 3వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఎస్కేయూ పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య జీవీ రమణ, కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, పరీక్షల విభాగాధిపతి తిరుమలేష్ చేతుల మీదుగా విడుదల చేశారు. 2016–19 మెగా సప్లిమెంటరీ పరీక్షల్లో 94 శాతం, 6వ సెమిస్టర్ పరీక్షల్లో 99.6 శాతం, పీజీ 3వ సెమిస్టర్‌లో 90 శాతం, ఆనర్స్ 7వ సెమిస్టర్‌లో 99 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పరీక్షల ఫలితాలను కళాశాల వెబ్‌సైట్లో చూసుకోవచ్చని కళాశాల పరీక్షల విభాగాధిపతి తిరుమలేష్ తెలిపారు. కార్యక్రమంలో ఉప పరీక్షా విభాగాధిపతులు అక్షుతానంద, చంద్రశేఖర్, జీఎల్ఎన్ ప్రసాద్, పల్లవి, ఫిరోజ్ ఖాన్, అహ్మద్, నరసింహులు, సోమశేఖర్, కేశాలు, నూగప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ ఈడీగా జగన్‌మోహన్ రావు

అనంతపురం రూరల్: జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఈడీగా జగన్ మోహన్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పౌరసరఫరాల శాఖలో ఏఎస్ఓగా పని చేస్తున్న జగన్‌మోహన్ రావును మైనార్టీ కార్పొరేషన్ ఈడీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన నగరంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేస్తానన్నారు. నూతన ఈడీకి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

జూలై 5న లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని బెంచుల్లో జూలై 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ. భీమారావు ఆదేశాల మేరకు మంగళవారం న్యాయసేవా సదన్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.రాజశేఖర్ అధ్యక్షతన మున్సిపల్, ఆర్టీసీ, బీఎస్ఎన్ఎల్ సంస్థ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ కే.శ్రీనివాస రావు మాట్లాడుతూ ఉచిత ప్రజా ప్రయోజన న్యాయ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎంవీఓపీ కేసులు, కొళాయి పన్ను, ఇంటి పన్ను కేసులు, బీఎస్ఎన్ఎల్ కేసులు అధిక సంఖ్యలో రాజీ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కందులు, మినుములు

- నేటి నుంచి ఆర్ఎస్‌కేల్లో రిజిస్ట్రేషన్లు



అనంతపురం సెంట్రల్: వందశాతం రాయితీతో కందులు, మినుములు, రాగులు, కొర్రలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్ అధికారులు తెలిపారు. బుధవారం నుంచి ఆర్ఎస్‌కేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులకు సూచించారు. 4 కేజీల మినీకిట్ల రూపంలో త్వరలో విత్తనాలను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఎల్ఆర్‌జీ–105 రకం కందులు 800 క్వింటాళ్లు, ఎల్ఆర్‌జీ 52 రకం కందులు 873 క్వింటాళ్లు మండలాల వారీగా కేటాయించినట్లు వివరించారు. అలాగే 60 క్వింటాళ్ల మినుములు, 16 క్వింటాళ్ల రాగులు, 6 క్వింటాళ్ల కొర్రలు కూడా మినీకిట్ల రూపంలో అర్హత కలిగిన రైతులకు అందిస్తామని తెలిపారు.

కాంట్రాక్టర్లకు దండి.. ఖజానాకు గండి!



సీనరేజీ.. సున్నా

- జీఓ నంబర్ 6తో రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లకు భారీ లబ్ధి
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ.3,200 కోట్ల విలువైన రోడ్ల పనులు
- కూటమి సర్కారు నిర్వాకంతో రూ.130 కోట్ల వరకూ ఖజానాకు నష్టం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మైనింగ్ మాఫియాకు స్వయానా సర్కారే ఊతమిస్తుండటం విస్మయం కలిగిస్తోంది. ఇప్పటికే కొందరు యథేచ్ఛగా ఇసుక, గ్రావెల్, క్వార్ట్జ్ తదితర ఖనిజాలను అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఈ క్రమంలోనే జాతీయ రహదారుల నిర్మాణం చేపడుతున్న బడా కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరుస్తూ ఇచ్చిన జీఓ చర్చనీయాంశంగా మారింది. 'రోడ్డు నిర్మాణ పనుల్లో తవ్విన మట్టిని ఎక్కడికైనా తోలుకోండి, పైసా కట్టక్కర లేదు' అన్న రీతిలో ఇచ్చిన జీఓ ఉమ్మడి అనంతపురం జిల్లాలో రహదారి నిర్మాణ కాంట్రాక్టర్లకు ఆయాచిత లబ్ధి చేకూర్చినట్లుగా తెలుస్తోంది.

కోట్లాది రూపాయల నష్టం

ఈ ఏడాది జనవరి 20న జీఓ నం.6ను ప్రభుత్వం విడుదల చేసింది. కాంట్రాక్టర్లకు రూ.కోట్లకు కోట్లు దోచిపెట్టే జీఓగా దీన్ని అభివర్ణిస్తున్నారు. గతంలో ఏవైనా పనుల నిమిత్తం రోడ్డులో తవ్విన మట్టిని ఆ సమీపంలోనే ఏర్పడిన గుంతలను పూడ్చడానికి, అక్కడే ఇతర అవసరాలకు వాడుకోవాలనే నిబంధన ఉండేది. మట్టిని ఏవైనా కారణాలతో లారీ లేదా టిప్పర్ల ద్వారా అర కిలోమీటరు దూరం తరలించినా సీనరేజీ కట్టాల్సి ఉండేది. అయితే, కూటమి సర్కారు జీఓ ద్వారా ఇందుకు మినహాయింపు నిచ్చింది. మట్టిని ఇష్టమొచ్చినట్లు ఎక్కడికైనా తరలించేలా అవకాశం కల్పించింది.దీంతో కాంట్రాక్టర్లు భారీగా గుంతలు తవ్వుతూ ఆ మట్టిని ఇతర పనులకు వాడుకుంటున్నారు. ఈ క్రమంలో సహజ వనరులు లూటీ కావడం ఒకెత్తయితే, సర్కారుకు సీనరేజీ రూపంలో వచ్చే ఆదాయంలో భారీగా కోత పడిందని మైనింగ్ అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో రూ.3,200 కోట్ల పనులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురం మొదలు తాడిపత్రి వరకూ రూ.3,200 కోట్లతో వివిధ మార్గాల్లో రోడ్డు పనులు జరుగుతున్నాయి. పుట్టపర్తి, పెనుకొండ, గుత్తి ఇలా పలు రహదారి పనులు చేపడుతున్నారు. ఈ రోడ్డు పనుల్లో భాగంగా మట్టిని తరలిస్తే కనీసం రూ.130 కోట్లకు పైనే సీనరేజీ వస్తుందని అధికారుల అంచనా. కానీ జీఓ నం.6తో ఒక్క పైసా రాలేదు. ఉదాహరణకు శింగనమల వద్ద పనులు జరుగుతుంటే ఆ మట్టిని కదిరివైపు తరలిస్తున్నారు. ఇలా పనులు ఒక చోట, మట్టిని మరోచోటుకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

భారీగా ముడుపులు

కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చే జీఓ.6కు సంబంధించి కూటమి సర్కారు పెద్దలకు భారీ ముడుపులు అందినట్టు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్లలో సీనరేజీ నష్టపోతున్న పరిస్థితుల్లో... ముఖ్య నేతలకు రూ. కోట్లలో ముడుపులు చెల్లించి జీఓ విడుదల చేయించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో సీనరేజీ చార్జీలు లేకపోవడంతో ఖజానాకు భారీ నష్టం చేకూరుతోంది.

ఉమ్మడి జిల్లాలో రోడ్డు పనులు	55కు పైగా
వీటి విలువ	రూ.3,200 కోట్లకు పైగా
సీనరేజీ రూపంలో రావాల్సిన డబ్బు	రూ.130 కోట్ల పైనే
జీఓ నం.6 వల్ల ప్రస్తుత ఆదాయం	000

కరువు నివారణకు ప్రణాళికలు

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: 'కరువు నివారణే లక్ష్యంగా కార్యాచరణ ఉండాలి. ఇందుకు సంబంధించి గ్రామస్థాయి నుంచి ప్రణాళికలు సిద్ధం చేసుకుని అమలు చేయాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కరువు సంక్షోభ నివారణ జిల్లాస్థాయి కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన శాఖలు సమన్వయం చేసుకుని రోడ్లకిరువైపులా, కాలువలు, పొలంగట్ల వెంబడి విస్తృతంగా మొక్కలు నాటాలన్నారు. ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచాలని సూచించారు. ఉపాధి పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, జెడ్పీ సీఈఓ రామసుబ్బయ్య, డ్వామా పీడీ సలీంబాషా, సీపీఓ అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

అనంతపురం అర్బన్: 'ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోగులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది' అంటూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల వైద్యులు, వైద్యమిత్రలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజూ రెండు ఆస్పత్రులను తనిఖీ చేయాలని ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో–ఆర్డినేటర్, డీసీహెచ్ఎస్‌లను ఆదేశించారు. సమావేశంలో వైద్యసేవ జిల్లా కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ పాల్‌రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్ముకుంటాం.. అప్పజెప్పండి



- ఆత్మకూరు మండలంలో కొందరు టీడీపీ నేతల కక్కుర్తి
- వ్యాపారులతో కుమ్మక్కై విత్తన వేరుశనగ పక్కదారి పట్టించేలా ప్లాన్
- ఎమ్మెల్యే పేరు చెప్పుకుంటూ పన్నాగం

ఆత్మకూరు: రైతులకు 40 శాతం రాయితీతో అందిస్తున్న విత్తన వేరుశనగ ఆత్మకూరు మండలంలో పక్కదారి పడుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి కబ్జాలు, దౌర్జన్యాలతో రెచ్చిపోతున్న టీడీపీ నేతలు తాజాగా విత్తన వేరుశనగపై కూడా కన్నేసినట్లు తెలిసింది. వేరుశనగ బస్తాలను ఎలాగోలా కొట్టేసి వ్యాపారులకు అమ్ముకునేలా ప్లాన్ వేసినట్లు సమాచారం. ఈ క్రమంలో టీడీపీ నేతల కక్కుర్తిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆత్మకూరు మండలానికి ప్రభుత్వం 1,900 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించింది. ఇప్పటి వరకు 1,400 క్వింటాళ్ల వరకు మండలానికి చేర్చింది. అయితే, వ్యాపారులతో కుమ్మక్కైన టీడీపీ నేతలు మండలంలో పలు చోట్ల విత్తన వేరుశనగ బస్తాలను తమకు అప్పజెప్పాలని వ్యవసాయ శాఖ సిబ్బందిపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. 'ప్రభుత్వం మాది.. మాకు వేరుశనగ బస్తాలు కావాలి.. వేలిముద్రలు మీరే రైతుల దగ్గర వేయించుకోండి. కావాలంటే ఎమ్మెల్యే ఇంటి నుంచి ఫోన్ చేయిస్తాం' అంటూ వ్యవసాయ శాఖ సిబ్బందిపై తీవ్ర ఒత్తిళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవసరం లేకపోయినా రైతులను రైతు సేవా కేంద్రాలకు పిలిపించి వేలిముద్రలు వేయించాక వ్యాపారులు వేరుశనగ కాయలు తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. మండలంలోని ఓ గ్రామంలో విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభం కాకముందే కొంత మంది టీడీపీ నేతలు రైతులతో ఒక లోడ్‌కు వేలిముద్రలు వేయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మరో గ్రామంలో రైతు సేవా కేంద్రానికి వెళ్లి 'మాకు ఒక లోడ్ వేరుశనగ కాయలు కావాలి.. అవసరమైతే ఎమ్మెల్యే ఇంటి నుంచి ఫోన్ చేయిస్తాం .. లోడ్ మాకిచ్చి మీరు వేలిముద్రలు వేయించుకోండి' అని బెదిరించినట్లు తెలుస్తోంది. టీడీపీ నేతల ఒత్తిళ్లతో వ్యవసాయ సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఎమ్మెల్యే పేరు చెబుతూ 'పచ్చ' నేతలు హల్‌చల్ చేస్తుండడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. 'తమ్ముళ్ల' నిర్వాకంతో తమకు విత్తనాలు అందకుండా పోతాయేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పంపనూరులో విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభించిన కలెక్టర్ వినోద్‌కుమార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 'విత్తన కాయలు అర్హులైన రైతులకు మాత్రమే అందాలి. పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని' హెచ్చరించినా 'పచ్చ' నేతలు బరితెగించడం గమనార్హం.

'అన్నదాత'.. గందరగోళం

- ఈ–కేవైసీపై స్పష్టతనివ్వని వ్యవసాయ శాఖ

అనంతపురం అగ్రికల్చర్: అన్నదాత సుఖీభవ పథకంపై వ్యవసాయ శాఖ మౌనం పాటిస్తోంది. క్షేత్రస్థాయిలో ఈ–కేవైసీపై రైతుల్లో గందరగోళం నెలకొన్నా జిల్లా స్థాయి అధికారులు ఒక్క ప్రకటన కూడా విడుదల చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతులు కచ్చితంగా ఈ–కేవైసీ చేయించుకోవాలంటూ ఇటీవల మండల స్థాయి అధికారులు చెప్పడంతో రైతులు ఆర్ఎస్‌కేలకు క్యూ కట్టారు. సర్వర్ పని చేయకపోవడంతో కేవైసీ కావడం లేదు. అయితే, వాస్తవ పరిస్థితులు గమనిస్తే అసలు ఈ–కేవైసీ అవసరం లేదని చెబుతున్నారు. గత ప్రభుత్వం 'వైఎస్సార్ రైతు భరోసా'తో పాటు కేంద్రం పీఎం కిసాన్ కింద పెట్టుబడి సాయం అందించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గతంలోనే 99 శాతం మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకున్నారు. అంతేకాకుండా పెన్షన్, ఇతరత్రా పథకాల కోసం కేవైసీ చేయించుకున్నందున మళ్లీ కొత్తగా అవసరం లేదని తెలిసింది. దీనిపై క్షేత్రస్థాయిలో అయోమయం నెలకొన్నా జిల్లా స్థాయి అధికారులు మాత్రం రైతుల దృష్ట్యా ఒక్క ప్రకటన విడుదల చేయకపోవడం గమనార్హం. మరోపక్క 'అన్నదాత సుఖీభవ' జాబితాలపై రైతుల్లో టెన్షన్ నెలకొంది. కూటమి సర్కారు ఇటీవల ఆర్ఎస్‌కే అసిస్టెంట్ల ద్వారా పరిశీలన చేపట్టి అక్కడక్కడా కొర్రీలు వేసినట్లు తెలిసింది. దీంతో అర్హత కలిగిన రైతులందరికీ డబ్బులు అందుతాయా లేదా అనే విషయంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్ జగన్ ప్రభుత్వం పార్టీలు, వర్గాలకు అతీతంగా ఏటా క్రమం తప్పకుండా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం జమ చేసింది. అయితే చంద్రబాబు ఎన్నికల ముందు ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పి నేడు పీఎం కిసాన్‌తో కలిపి రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.14 వేలు మూడు విడతల్లో ఇస్తామని ప్రకటించారు. కాలయాపన చేసి మొదటి సంవత్సరం జిల్లా రైతులకు రూ.400 కోట్లకు పైగా ఎగనామం పెట్టేశారు.

హైస్కూల్ చదువు.. ఉఫ్!

- చంద్రబాబు సర్కారు నిర్వాకం
- రామగిరి స్కూల్ హోదా తగ్గింపు
- ప్రభుత్వ తీరుపై గ్రామస్తుల కన్నెర్ర



స్కూల్‌ను డీగ్రేడ్ చేయడంపై ఆందోళన చేస్తున్న రామగిరి వాసులు

పామిడి: చంద్రబాబు సర్కారు నిర్ణయం ఆ పిల్లలకు అవస్థలు తెచ్చిపెట్టింది. తల్లిదండ్రులకు ఆగ్రహం తెప్పించింది. ఇప్పటికే ఉన్న పాఠశాల స్థాయిని పెంచకుండా.. ఉన్నదాన్ని కూడా తగ్గించడంపై మండిపడుతున్నారు. వివరాలు.. పామిడి మండలం రామగిరిలో ఏర్పాటు చేసిన ప్రైమరీ పాఠశాలను గతంలో యూపీగా, తర్వాత హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కార్యక్రమం కింద రూ.65 లక్షలతో పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

కూటమి సర్కారు నిర్ణయం.. తల్లిదండ్రుల ఆగ్రహం..

ఇటీవల పాఠశాల విద్యలో సంస్కరణలకు తెరలేపిన కూటమి సర్కారు.. అందులో భాగంగా ఏవేవో సాకులతో రామగిరి పాఠశాల హోదాను తగ్గించింది. ప్రైమరీ స్కూల్‌గా డీగ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకూ ఉన్న హైస్కూల్‌ను ప్రాథమిక పాఠశాలగా స్థాయి తగ్గించడంపై పిల్లల తల్లిదండ్రుల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. స్థలం లేదన్న సాకుతో చెత్త నిర్ణయం తీసుకున్నారంటూ గ్రామస్తులు మండిపడుతున్నారు. పిల్లలు హైస్కూల్ చదువులు చదవకుండా చేస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. వారం రోజులుగా నిత్యం పాఠశాల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

దేవుడు వరమిచ్చినా..



వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో 'నాడు–నేడు' పథకం కింద స్కూల్ భవన నిర్మాణానికి రూ.65 లక్షల నిధులు మంజూరయ్యాయి. అయితే, దేవుడు వరమిచ్చినా.. పూజారి వరం ఇవ్వలేదన్న చందంగా ఈ ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. రామగిరి పాఠశాలను డిమోట్ చేయడం అన్యాయం. చంద్రబాబు సర్కారు నిర్వాకంతో పిల్లల చదువులు ఆగిపోతాయి. **– మజ్జిగ రాజశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు, పామిడి మండలం**

చాలా బాధాకరం



జగన్ హయాంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను కార్పొరేటు స్థాయిలో తీర్చిదిద్దారు. కూటమి ప్రభుత్వం మా గ్రామంలోని పాఠశాలను 5వ తరగతి వరకే కుదించడం చాలా బాధాకరం. దీంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. హైస్కూల్‌గానే కొనసాగించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. **– సోమశేఖర్, రామగిరి గ్రామం**

రైతులపై బీమా బండ

- కూటమి సర్కారు ఘనకార్యం
- ప్రీమియం చెల్లింపునకు ఎగనామం
- ఉచిత పంటల బీమాతో వైఎస్ జగన్ హయాంలో రైతులకు భారీగా పరిహారం
- నాడు 14.20 లక్షల మందికి రూ.1,883 కోట్ల బీమా

అనంతపురం అగ్రికల్చర్: కరువు రైతులపై కూటమి సర్కారు పంటల బీమా బండ వేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దు చేసి ప్రీమియం భారం మోపింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్‌లో రూ.150 కోట్లకు పైగా ప్రీమియం రూపంలో రైతులు చెల్లించాల్సి ఉంటుంది. పంట రుణాలు తీసుకునే రైతుల నుంచి బ్యాంకులు ప్రీమియం కట్టించుకుంటాయి. మిగతా రైతులు సీఎస్‌సీ సెంటర్లలో ప్రీమియం కట్టి నమోదు చేయించుకోవాలి. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో నమోదైన రైతులు బీమా పథకాల పరిధిలోకి రానున్నారు. అయితే, దీనిపై జిల్లా వ్యవసాయశాఖ ఇప్పటి వరకు నోరు మెదపకపోవడం గమనార్హం.

జిల్లాలో 12 పంటలకు..

క్లస్టర్ పరిధిలో ఉన్న అనంతపురం జిల్లాలో వాతావరణ బీమా కింద వేరుశనగ, పత్తి, అరటి, చీనీ, దానిమ్మ, టమాట పంటలను చేర్చారు. అన్నింటినీ మండలం యూనిట్‌గా తీసుకుంటారు. వేరుశనగ హెక్టారుకు రూ. 80 వేలు, పత్తి రూ.95 వేలు, అరటికి రూ. 1.50 లక్షలు, చీనీకి రూ.1,37,500, దానిమ్మకు రూ.1,87,500, టమాటకు రూ.80 వేలు బీమా పరిహారంగా ఖరారు చేశారు. జూలై 15లోపు రైతులు తమ వాటా కింద ప్రీమియం



వేరుశనగ పంట

చెల్లించాలి. ఆటోమేటిక్ వెదర్‌బేస్డ్ స్టేషన్లలో నమోదైన వర్షపాతం, వాతావరణం, గాలిలో తేమ శాతం, చీడపీడలు తదితర వివరాల ఆధారంగా బీమా పరిహారం లెక్కకట్టనున్నారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో వాతావరణ బీమా అమలు కానుంది. ఇక ప్రధానమంత్రి ఫసల్ బీమాలో క్లస్టర్ –1 కింద గుర్తించిన అనంతపురం జిల్లాలో గ్రామం యూనిట్‌గా కంది పంటను చేర్చారు. మండలం యూనిట్ కింద వరి, జొన్న, మొక్కజొన్న, పత్తి, ఎండుమిరప పంటలకు వర్తింపజేశారు. కంది హెక్టారుకు రూ.50 వేలు, వరికి రూ. 1.02 లక్షలు, జొన్నకు రూ.52,500, మొక్కజొన్నకు రూ.82,500, ఆముదం రూ.50 వేలు,ఎండు మిరప రూ.2.25 లక్షలు బీమా పరిహారంగా ఖరారు చేశారు. వరి పంటకు ప్రీమియం ఆగస్టు 15 లోపు చెల్లించాలి. మిగతా పంటలకు జూలై 31ని ఆఖరు తేదీగా నిర్ణయించారు. పంట కోత ప్రయోగాల్లో వచ్చిన దిగుబడుల ఆధారంగా పరిహారం లెక్కిస్తారు. ఈ క్రమంలో కందిలో అత్యధికంగా 846 పంట కోత ప్రయోగాలు చేపట్టనున్నారు. అలాగే వరిలో 96, జొన్నలో 36, మొక్కజొన్నలో 72, ఆముదంలో 36, ఎండుమిరప పంటలో 36 పంట కోత ప్రయోగాలు నిర్వహించనున్నారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో 10 పంటలకు..

శ్రీ సత్యసాయి జిల్లాలో వాతావరణ బీమా కింద వేరుశనగ, పత్తి, టమాట, చీనీ, దానిమ్మ పంటలకు వర్తింపజేశారు. ఇఫ్కో టోకియా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ అమలు చేయనుంది. ఫసల్‌బీమా కింద 'శ్రీ సత్యసాయి'లో కంది పంటను గ్రామం యూనిట్‌గా తీసుకున్నారు. వరి, మొక్కజొన్నను మండలం యూనిట్‌గానూ, ఆముదం, రాగి పంటలను జిల్లా యూనిట్‌గా తీసుకున్నారు. కందిలో 720 పంట కోత ప్రయోగాలు, మొక్కజొన్నలో 84, వరిలో 36, రాగిలో 26, ఆముదంలో 26 పంట కోత ప్రయోగాలు చేపట్టనున్నారు. అనంతపురం జిల్లా మాదిరిగా బీమా పరిహారం, ప్రీమియం చెల్లింపు, కటాఫ్ తేదీ నిర్ణయించారు.

వైఎస్ జగన్ హయాంలో హాయిగా...

2019 నుంచి 2024 వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు ఎలాంటి ప్రీమియం భారం పడకుండా ఉచితంగా పంటల బీమా పథకాలు అమలు చేయడంతో హాయిగా సాగిపోయింది. నిబంధనల మేరకు పరిహారం కూడా ఇవ్వడంతో రైతులకు భారీగా లబ్ధి చేకూరింది. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 14.20 లక్షల మంది రైతులకు ఏకంగా రూ.1,883 కోట్ల బీమా పరిహారం జమ అయింది. ప్రీమియం రూపంలో ఏటా ఉమ్మడి జిల్లా రైతులకు రూ.150 కోట్ల వరకు ఆదా కావడం గమనార్హం.కానీ, నేడు ప్రీమియం బండ పడటం గమనార్హం. దీనికి తోడు నిబంధనల మేరకు భవిష్యత్తులో పరిహారం ఇచ్చి న్యాయం చేస్తారో లేదోనని రైతులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

బీమా ప్రీమియం ఇలా..

వ్యవసాయ పంటలకు	2 శాతం
ఉద్యాన పంటలకు	5 శాతం
ఉమ్మడి జిల్లా రైతులపై పడే భారం	రూ.150 కోట్లకు పైగా

నెట్టికంటుడి హుండీ కానుకల లెక్కింపు



నగదు లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. 83 రోజులకు గానూ రూ. 81,39,461 లక్షల నగదు, అన్నదానం హుండీ ద్వారా రూ.44,173 నగదుతో పాటు 10 అమెరికన్ డాలర్లు,0.014 గ్రాముల బంగారం, 2.960 కిలోల వెండి సమకూరినట్లు ఆలయ ఈఓ కె.వాణి తెలిపారు. ఈ ప్రక్రియను ఆలయ ఏఈఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది, పోలీసుల సమక్షంలో వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన వీరభద్రసేవా సమితి, హనుమాన్ సేవా సమితి, రాఘవేంద్ర సేవా సమితి, శ్రీరామ సేవాసమితి సభ్యులు చేపట్టారు.

క్లుప్తంగా

హస్త కళాకారులకు డిజైనర్ పోటీలు

అనంతపురం కల్చరల్: కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా లేపాక్షి, ఆప్కో సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో హస్త, చేనేత కళాకారులకు రాష్ట్ర స్థాయి సావనీర్ డిజైనర్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య మంగళవారం వెల్లడించారు. 18 ఏళ్లకు పైబడిన హస్త కళాకారులు, చేనేత వృత్తిదారులు, డిజైనర్లు మాత్రమే కాకుండా విద్యార్థులు కూడా పాల్గొనవచ్చన్నారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారీ ప్రింట్లు, లెదర్ పప్పెట్స్, ఫుడ్ కార్వింగ్, ధర్మవరం.. ఉప్పాడ.. మంగళగిరి.. బందారు వస్త్రాల్లో నూతనత్వం ఉట్టిపడేలా కొత్త డిజైన్లను రూపొందించాల్సి ఉంటుంది. ప్రతి విభాగంలోనూ నగదు పురస్కారాలను అందజేయనున్నారు. ఆసక్తి ఉన్న వారు తాము రూపొందించిన నమూనాలను జూలై 16వ తేదీ లోపు లేపాక్షి ఎంపోరియం లేదా ఆప్కో షోరూమ్‌లో అందించాలి.

ఏఎంసీకి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పూర్వ సూపరింటెండెంట్, కార్డియోథొరాసిక్ సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి అనంతపురం మెడికల్ కళాశాల (ఏఎంసీ)కు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలులో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారనే కారణంతో ప్రభుత్వం ఆయనను బదిలీ చేసింది. ఆయన సేవలను దృష్టిలో ఉంచుకుని కర్నూలులోనే కొనసాగించాలని ప్రభుత్వానికి కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ విన్నవించారు. కాగా సోమ, మంగళవారాల్లో జూమ్ ద్వారా నిర్వహించిన బదిలీల్లో కళాశాలలో మొత్తం 19 మంది వైద్యులకు స్థానచలనం కలిగింది. వీరిలో అనంతపురానికి గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ మాధవీలత (ఫిజియాలజీ), అసిస్టెంట్ ప్రొఫెసర్లలో డాక్టర్ మీనిగ శ్రీనివాసులు(జనరల్ మెడిసిన్), డాక్టర్ పి.స్నేహ, పి.మమత(గైనకాలజీ), డాక్టర్ అనురాధ(ఆప్తమాలజీ) బదిలీ అయ్యారు.

20న ఎకాలజీ సెంటర్‌లో జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్: టైమ్స్ ప్రో ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగాలకు సంబంధించి ఈ నెల 20న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సెంటర్ డైరెక్టర్ వై.వి.మల్లారెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ ఉత్తీర్ణత, 26 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులు. ఆసక్తి ఉన్న వారు అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఎకాలజీ సెంటర్‌లో 20న జరిగే జాబ్‌మేళాకు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావచ్చు.

దొడ్డిదారి పాయింట్లపై చర్యలేవీ?

- టీచర్ల బదిలీల్లో ఇష్టానుసారంగా 'స్టేషన్' పాయింట్లు
- నిబంధనలు తుంగలో తొక్కి వందలాది మందికి 24 పైబడి పాయింట్లు
- ప్రతి మండలంలోనూ 6 నుంచి 10 మంది టీచర్ల అడ్డదారులు
- ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు
- ఎలాంటి చర్యలు లేకుండానే బదిలీల ప్రక్రియ పూర్తి


బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా దొడ్డిదారిన పాయింట్లు పొందిన వారిపై చర్యలు తీసుకోకుండా వారికి సౌకర్యవంతమైన స్కూళ్లను కేటాయించిన జిల్లా విద్యాశాఖ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా స్టేషన్ పాయింట్ల నమోదులో విపరీతమైన అక్రమాలు చోటు చేసుకున్నాయి. స్టేషన్ సర్వీస్ పాయింట్లు గరిష్ఠంగా 24కు (3వ కేటగిరి) మించి ఉండకూడదని నిబంధనలున్నాయి. ఎందుకంటే స్టేషన్ సర్వీస్ 8 ఏళ్లకు స్లాబ్ చేశారు. 9 నుంచి10 ఏళ్ల సర్వీస్ ఉన్నా, 24 పాయింట్లే వేయాలి. అయితే కొందరు తాము పని చేసిన మొత్తం సర్వీస్‌కు పాయింట్లు వేసుకోవడంతో 27, 30 చొప్పున పాయింట్లు వచ్చాయి. ఇలాంటి వారు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కుప్పలు తెప్పలుగా ఉన్నారు. ప్రతి మండలం నుంచి కనీసం 6 నుంచి 10 మంది టీచర్లు అక్రమంగా పాయింట్లు నమోదు చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. అలాగే ఎస్జీటీ తెలుగుకు సంబంధించి 84 మంది స్టేషన్ పాయింట్లు ఎక్కువగా వేసుకున్నారని అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

రీపోర్స్‌మెంట్‌కు గురైన టీచర్లకు ఇలా..

రీపోర్స్‌మెంట్‌కు గురైన టీచర్లకు 24 పాయింట్లు వచ్చేందుకు ఆస్కారం లేదు. ఉదాహరణకు పాతస్టేషన్‌లో 6 ఏళ్లు, కొత్త స్టేషన్‌లో రెండేళ్లు పని చేసి రీపోర్స్‌మెంట్‌కు గురై ఉంటే ఏదో ఒక్క స్టేషన్ పాయింట్లు మాత్రమే పొందాల్సి ఉంది. ఈ లెక్కన పాత స్టేషన్ మాత్రమే తీసుకుంటే ఆరేళ్లకు 18 పాయింట్లు ఇస్తారు. లేదా కొత్త స్కూల్ తీసుకుంటే రెండేళ్లకు నాలుగు పాయింట్లతో పాటు అదనంగా 5 ప్రత్యేక పాయింట్లు ఇస్తారు. ఒకవేళ రెండుసార్లు రీపోర్స్‌మెంట్ (2023, 2025)కు గురై ఉంటే 7 ప్రత్యేక పాయింట్లు వస్తాయి. ఇక్కడ పాత స్కూల్ పాయింట్లు డ్రా చేసుకునేందుకు వీలులేదు. దీంతో చాలా మంది ఈ రెండు విధానాలను లెక్క కట్టి ఎక్కువ పాయింట్లు ఉన్న దానిని ఎంచుకోవడం సహజం. అయితే కొందరు టీచర్లు అక్రమంగా వీలైనన్ని పాయింట్లు పొందారు. ఈ క్రమంలో పాత స్టేషన్, కొత్త స్టేషన్ రెండూ కలిపి పాయింట్లు వేసుకున్నారు. దీనికి రీపోర్స్‌మెంట్ పాయింట్లూ కలుపుకున్నారు.

ఎంఈఓలు, డీఈఓ కార్యాలయ సిబ్బంది అండతోనే

టీచర్లు పొరపాటునో, లేదా కావాలనో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ పాయింట్లు వేసుకుంటే ఒకటికి రెండుసార్లు పరిశీలించి వాటిని తొలిగించాలంటూ అధికారులకు విద్యాశాఖ కమిషనర్ పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హడావుడి, తీవ్రమైన గందోరగోళం నెలకొన్న పరిస్థితుల్లో మండలాల్లో ఎంఈఓలు కాని, జిల్లా కేంద్రంలో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, సాంకేతిక నిపుణలు ఇవేవీ పట్టించుకోలేదు. టీచరు ఆన్‌లైన్‌లో 'దరఖాస్తు చేసుకున్నాడా...ఎంఈఓ నిర్ధారించారా...మేమూ నిర్ధారించామా' అనేలా ప్రక్రియ పూర్తి చేశారు. అక్రమంగా పొందిన పాయింట్ల ఆధారంగా చాలామంది టీచర్లు మంచి స్థానాలకు వెళ్లారు.

అడ్డగోలుగా 'ప్రిఫరెన్షియల్ కేటగిరీ', 'స్పెషల్' పాయింట్లు

మరోవైపు 'ప్రిఫరెన్షియల్ కేటగిరీ, ప్రత్యేక పాయింట్లు పొందడంలోనూ చాలామంది టీచర్లు అడ్డదారులు తొక్కారు. కొందరు వైద్యులు కక్కుర్తిపడడంతో లేని రోగాలు ఉన్నట్లు, సర్జరీ చేయకపోయినా చేసినట్లు, సాధారణ రోగాలను పెద్ద రోగాలుగా చూపిస్తూ సర్టిఫికెట్లు జారీ చేశారు. చాలామంది టీచర్లు ప్రిఫరెన్షియల్ కేటగిరీ, ఇంకొందరు ప్రత్యేక పాయింట్లు పొంది మంచిస్థానాలకు వెళ్లారు. నార్పల ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఓ టీచరుకు ఎలాంటి సర్జరీ జరగలేదు. అయినా సర్జరీ జరిగినట్లు సర్టిఫికెట్ పెట్టి నగరంలోని ప్రభుత్వ స్కూల్‌కు వచ్చారు. చెన్నేకొత్తపల్లి మండలంలో పని చేస్తున్న ఓ టీచరు.. స్పైనల్ సర్జరీ చేయించుకున్నట్లు డాక్టర్ సర్టిఫికెట్ పొంది మండల కేంద్రానికి వచ్చారు. సర్జరీ విషయం ఎస్ఆర్‌లో ఎంట్రీ లేదు. తీరా బదిలీల సమయంలో ఇలా నకిలీ సర్టిఫికెట్‌తో దగ్గర స్కూల్‌కు వచ్చి తమకు అన్యాయం చేశారని జాబితాలో ఆ టీచరు వెనుక ఉన్న టీచర్లు వాపోయారు. వ్యక్తిగతంగా అర్జీలు ఇచ్చిన టీచర్ల పాయింట్లు మార్పు చేశారు కానీ, ఫలానా టీచర్లు అక్రమంగా పాయింట్లు వేసుకున్నారంటూ ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు చేసిన ఫిర్యాదులన్నీ బుట్టదాఖలయ్యాయి. కాగా...అక్రమంగా పాయింట్లు పొందిన ప్రతి టీచరుపైనా ఖచ్చితంగా చర్యలుంటాయని డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు పేర్కొనడం కొసమెరుపు.

మహిళను చెట్టుకు కట్టేయడమేంటి బాబూ..

- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మండిపడ్డారు. సాక్షాత్తు సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలోనే ఓ మహిళను చెట్టుకు కట్టేసి వేధించడం సిగ్గు చేటన్నారు. జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కుప్పం ప్రాంతానికి చెందిన భర్త చేసిన అప్పు చెల్లించలేదన్న అక్కసుతో నారాయణపురం గ్రామానికి చెందిన శిరీషను ఓ టీడీపీ కార్యకర్త చెట్టుకు కట్టేయడాన్ని ఆమె ఖండించారు. ఉమ్మడి జిల్లాలోని ఓ దళిత మైనర్ బాలికపై అఘాయిత్యం, గిరిజన యువతి తన్మయి హత్యపై టీడీపీ ప్రజాప్రతినిధులు కానీ, ఆ పార్టీ నాయకులు కాని స్పందించలేదన్నారు. దీనిని బట్టి చూస్తుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలపై ఇప్పటికైనా రాష్ట్ర గవర్నర్ స్పందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహిళా విభాగం జిల్లా కార్యదర్శి భారతి, నాయకురాళ్లు శోభారాణి, శోభాబాయి, అనురాధ, చంద్రకళ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీతో 'అనంత'కు అంతర్జాతీయ గుర్తింపు


రంగయ్య పాదయాత్రలో మాట్లాడుతున్న అనంతపురం మేయర్ వసీం


పాదయాత్రలో పాల్గొన్న మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, ఉమా

- అనంతపురం కార్పొరేషన్ మేయర్ వసీం

కళ్యాణదుర్గం: ఆర్డీటీ కార్యకలాపాలతో అనంతపురానికి అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందని, అంతటి పెద్ద సంస్థకు ఇబ్బంది కలిగితే వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య సారథ్యంలో ప్రజలంతా ఏకమై పోరాటానికి సిద్ధం కావడం అభినందనీయమని అనంతపురం నగర మేయర్ వసీం అన్నారు. ఆర్డీటీ పరిరక్షణకు తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్ర మంగళవారం కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లిలో సాగింది. ఈ సందర్భంగా పాదయాత్రలో వసీం పాల్గొని, మాట్లాడారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ కోసం రంగయ్య చేపట్టిన పాదయాత్ర ఆయన స్వలాభం కోసమేనంటూ టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలు అర్థరహితమన్నారు. రంగయ్య పాదయాత్రతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కదలిక వచ్చిందన్నారు. ఇప్పటికైనా వృథా ఆరోపణలు మాని ప్రజాహితం, కరువు ప్రాంతాల అభివృద్ధి కోసం ఆర్డీటీకి అండగా నిలవాలని హితవు పలికారు. ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా ఎన్నో సేవా కార్యక్రమాలతో పేదల బతుకుల్లో ఆర్డీటీ ఓ భాగమైందన్నారు. ఆర్డీటీ అంశంలో ప్రజలు మరింత చైతన్యంతో ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, నేత మాదినేని ఉమామహేశ్వర నాయుడు, జెడ్పీటీసీలు బొమ్మయ్య, గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీలు సుబ్బర హేమలత, మారుతమ్మ, ఆంజనేయులు, మండల కన్వీనర్ గోళ్ల సూర్యనారాయణ, అనంతపురం కార్పొరేటర్లు కమల్ భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, రామాంజినేయులు, నాయకులు కాకర్ల శీన, కుళ్లాయిస్వామి, పలువురు ఆర్డీటీ లబ్ధిదారులు పాల్గొన్నారు. కాగా, రంగయ్య పాదయాత్ర కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి వరకు కొనసాగింది. వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు మహాలక్ష్మి శ్రీనివాస్, అనంతపురం డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాకు 2,729 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు కంపెనీల నుంచి ఎరువులు సరఫరా అవుతున్నట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరుకున్న ఎరువులను ఆయన పరిశీలించారు. ఇఫ్కో కంపెనీ నుంచి 2,729 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు తెలిపారు. ఇందులో 1,967 మెట్రిక్ టన్నుల డీఏపీ, 762 మెట్రిక్ టన్నుల 20-20-0-13 రకం కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయన్నారు. కలెక్టర్, జేసీ, జేడీఏ ఆదేశాలను అనుసరించి ఇండెంట్ మేరకు సొసైటీలు, ఆర్ఎస్‌కేలు, ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

జిల్లాకు 2,729 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు కంపెనీల నుంచి ఎరువులు సరఫరా అవుతున్నట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరుకున్న ఎరువులను ఆయన పరిశీలించారు. ఇఫ్కో కంపెనీ నుంచి 2,729 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు తెలిపారు. ఇందులో 1,967 మెట్రిక్ టన్నుల డీఏపీ, 762 మెట్రిక్ టన్నుల 20-20-0-13 రకం కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయన్నారు. కలెక్టర్, జేసీ, జేడీఏ ఆదేశాలను అనుసరించి ఇండెంట్ మేరకు సొసైటీలు, ఆర్ఎస్‌కేలు, ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

సెక్యూరిటీ గార్డు అరెస్ట్

- 19 సెల్‌ఫోన్ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, నిందితుడి (బ్లూ టీషర్ట్) ని చూపుతున్న జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది

గుంతకల్లు: సెల్‌ఫోన్లు అపహరించి అజ్ఞాతంలోకి వెళ్లిన సెక్యూరిటీ గార్డు శుభాంకర్‌ను అరెస్ట్ చేసినట్లు జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రయాణికుల భద్రత చర్యల్లో భాగంగా సోమవారం రాత్రి జీఆర్‌పీ ఎస్పీ రాహుల్‌మీనా ఆదేశాల మేరకు జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సంయుక్తంగా గుంతకల్లు జంక్షన్‌లోని ప్లాట్‌ఫారాలు, రైళ్లలో తనిఖీలు చేపట్టాయి. ఆ సమయంలో బెంగుళూరు నుంచి భువనేశ్వర్ వెళుతున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో అనుమానస్పదంగా కనిపించిన శుభాంకర్ బ్యాగ్‌ను పరిశీలిస్తే 19 సెల్‌ఫోన్లు బయటపడ్డాయి. ఒడిశాకు చెందిన శుభాంకర్ బెంగుళూరులోని టవర్ కేర్ ప్రాంతంలోని కేపీఎస్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అందులో పని చేస్తున్న ఉద్యోగులు నిబంధన మేరకు తన వద్ద డిపాజిట్ చేసిన సెల్‌ఫోన్లు అపహరించి స్వగ్రామానికి వెళుతున్నట్లుగా విచారణలో అంగీకరించాడు. కాగా, శుభాంకర్‌పై కేపీఎస్ ఫ్యాక్టరీ ఉద్యోగులు టవర్ కేర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న శుభాంకర్‌ను టవర్ కేర్ పోలీసులకు గుంతకల్లు రైల్వే పోలీసులు అప్పగించారు.

టెన్త్ టాపర్‌కు బాల్య వివాహయత్నం

నార్పల: టెన్త్ టాపర్‌కు బాల్య వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు సిద్ధం కావడంత అప్రమత్తమైన అధికారులు అడ్డుకున్నారు. వివరాల్లోకెళ్తే శింగనమల మండలం బండమీదపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన నార్పల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అత్యుత్తమ మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది. అయితే బాలికకు ఆమె మేనమామతో వివాహం జరిపేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేయడంతో విషయం తెలుసుకున్న అధికారులు అడ్డుకున్నారు. కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

నేర సమాచారం

ట్రాక్టర్ కిందపడి రైతు మృతి


మృతుడు శ్రీనివాసులు

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు(62) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... అమీనాబాదు గ్రామానికి చెందిన శ్రీనివాసులు మంగళవారం ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా అదుపు తప్పి కిందపడ్డాడు. అతని మీదుగా ట్రాక్టర్ దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శ్రీనివాసులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

ప్రమాదంలో బైక్ రైడర్..


మృతుడు సుబ్రహ్మణ్యం

గుత్తి రూరల్: మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ బైక్ రైడర్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌కు చెందిన సుమారు 20 మంది బైక్ రైడర్లు ఇటీవల బెంగళూరుకు జాలీ ట్రిప్ నిర్వహించారు. ఈ క్రమంలో ట్రిప్ పూర్తి కావడంతో తిరుగు ప్రయాణమైన వారు మంగళవారం వేకువజామున గుత్తి మండలం ఊబిచెర్ల వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై బైక్ రైడర్ ఆదిత్య సుబ్రమణ్యం (44) నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆదిత్యను వెంటనే హైవే అంబులెన్స్ ద్వారా గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి..


మృతుడు అమర్‌నాథ్

తాడిపత్రి టౌన్: స్థానిక రూరల్ పరిధిలోని ఆర్జాస్ స్టీల్ ఫ్యాక్టరీ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో వైఎస్సార్ కడప జిల్లా ఆర్ఎస్ కొండాపురం మండలం దత్తాపురం గ్రామానికి చెందిన అమర్‌నాథ్ (30) మృతి చెందాడు. ఆర్జాస్ స్టీల్ ఫ్యాక్టరీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్న అమర్‌నాథ్ ద్విచక్ర వాహనంపై తాడిపత్రి నుంచి ఫ్యాక్టరీకి వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అతిగా మద్యం సేవించి గుర్తు తెలియని వ్యక్తి..

తాడిపత్రిలోని సీబీ రోడ్డులో మంగళవారం అతిగా మద్యం సేవించి అపస్మారక స్థితికి చేరుకున్న వ్యక్తిని పోలీసులు గుర్తించారు. 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి బలవన్మరణం


మృతుడు ఇంతియాజ్

గుత్తి: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుత్తి పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో నివాసముంటున్న చాంద్ బాషా కుమారుడు ఇంతియాజ్ (24) ఓ యువతిని ప్రేమించాడు. ఇద్దరు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే పెద్దలు అంగీకరించలేదు. పంచాయితీ పెట్టి ఇద్దరూ కలుసుకోకూడదని నిర్ణయించారు. దీంతో కొన్ని రోజులుగా ముభావంగా ఉంటూ వచ్చిన ఇంతియాజ్ మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అధినేతకు ఆహ్వానం

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కుటుంబ సభ్యులు కలిశారు. విశ్వేశ్వరరెడ్డి కుమారుడు, పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ ప్రణయ్‌రెడ్డి, రోహితారెడ్డి వివాహం ఆగస్టు 14న అనంతపురంలో జరగనుంది. వివాహ పత్రికను అందజేసి, ఆహ్వానించారు.


వైఎస్ జగన్‌కు ఆహ్వాన పత్రికను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు విశ్వ.పెద్దారెడ్డి కుటుంబ సభ్యులు

ప్రవాసాంధ్రుల భేటీ

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో పార్టీ ఎన్ఆర్ఐ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రవాసాంధ్రులు కలిశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ గెలుపుపై తాము చేపట్టే కార్యక్రమాలను వివరించారు. జగన్‌ను కలసిన వారిలో ప్రవాసాంధ్రులు పెద్దిరెడ్డి (ఆస్ట్రేలియా), కృష్ణ (కెనడా), కుమార్‌రెడ్డి (యునైటెడ్ కింగ్‌డమ్), సారథి వంగా (నెదర్లాండ్స్), కామేష్ (జర్మనీ), నవీన్ (యూఎస్ఏ), వంశీ (యూఎస్ఏ) తదితరులున్నారు.


జగనన్నను కలసిన ప్రవాసాంధ్రులు (చిత్రంలో) ఆలూరు సాంబశివారెడ్డి

వృద్ధుడి ఆత్మహత్య


నాగలింగ (ఫైల్)

గుంతకల్లు రూరల్: మండలంలోని నల్లదాసరపల్లి సర్పంచ్ పార్వతి భర్త నాగలింగ (66) ఆత్మహత్య చేసుకున్నాడు. తమకున్న ఇద్దరు కుమారులకు నాగలింగ దంపతులు పెళ్లిళ్లు చేయడంతో ఎవరికి వారు వేరు కాపురాలు ఉంటున్నారు. వృద్ధులైన తల్లిదండ్రులు తరచూ కుమారుల ఇళ్లకు వెళ్లి వచ్చేవారు. ఉన్న కొద్దిపాటి భూమిని కుమారులు సమానంగా పంచుకుని వ్యవసాయం చేసుకుంటున్నారు. పెద్ద కుమారుడు రాజు మిరప సాగులో నష్టపోయి అప్పులపాలయ్యాడు. రెండేళ్లుగా పంట సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.10 లక్షలకు చేరుకుంది. గత ఏడాది పండించిన 40 క్వింటాళ్ల మిరప పంటను బళ్లారిలోని స్టోరేజ్ పాయింట్‌లో రాజు నిల్వ చేశాడు. ఆ పంటను విక్రయించి అప్పు కట్టాలని తరచూ కుమారుడికి నాగలింగ చెబుతూ వచ్చేవాడు. మంగళవారం ఉదయం మరోసారి పంట విక్రయం, అప్పులు చెల్లించే విషయాన్ని తండ్రి గుర్తు చేయడంతో ధర గిట్టుబాటు అయ్యేంత వరకూ పంట అమ్మేది లేదని రాజు గట్టిగా చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. దీంతో అప్పుల ఊబిలో కుమారుడు కూరుకుపోతున్నాడనే వేదనతో నాగలింగ ఇంటి బయట ఉన్న బాత్‌రూంలో ఉంచిన పెట్రోల్ తీసుకుని శరీరంపై వేసుకుని నిప్పంటించుకున్నాడు. ఒక్కసారిగా ఎగిసి పడిన మంటలను గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే మంటలను ఆర్పి అంబులెన్స్ ద్వారా నాగలింగను గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆరోగ్య శాఖలో 68 మంది బదిలీ

అనంతపురం మెడికల్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని వివిధ పీహెచ్‌సీలలో పనిచేస్తున్న 68 మంది ఉద్యోగులను సీనియారిటీ ప్రాతిపదికన వారు ఎంచుకున్న స్థానాలకు బదిలీ చేశారు. బదిలీల కౌన్సిలింగ్‌ను మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి నిర్వహించారు. జూనియర్ అసిస్టెంట్, తదితర ఉద్యోగులు 87 మంది దరఖాస్తు చేసుకోగా, 68 మందికి బదిలీలు జరిగాయి.

జీజీహెచ్‌లో వైద్యుల బదిలీ

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వైద్యులు బదిలీ అయ్యారు. చిన్న పిల్లల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ శంకర్‌నారాయణ, రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేంద్రనాయుడు, సైకియార్టీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్‌కుమార్ కడపకు బదిలీ అయ్యారు. పల్మనాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రామస్వామి విశాఖపట్నం, గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ సంధ్య కర్నూలుకు, ఫిజియాలజీ నుంచి డాక్టర్ రాధిక కర్నూలు జీజీహెచ్‌కు, గైనకాలజిస్టు డాక్టర్ పార్వతి విజయవాడకు బదిలీ అయ్యారు.

వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కమిటీలో చోటు


ఈ.రామమూర్తి


సాకే ఉమామహేష్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగ కమిటీల్లో జిల్లా వాసులకు చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా ఈ.రామమూర్తి(కళ్యాణదుర్గం), సాకే ఉమామహేష్ (అనంతపురం), రాష్ట్ర అధికార ప్రతినిధిగా సాకే చిరంజీవి (అనంతపురం), రాష్ట్ర కార్యదర్శులుగా రమావత్ సోమూనాయక్ (ఉరవకొండ), బి.భోజరాజ్ నాయక్ (రాయదుర్గం)కు చోటు కల్పించారు.

భర్త దాడి.. భార్య మృతి

రాప్తాడు: భర్త దాడిలో గాయపడిన భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని నవోదయ కాలనీకి చెందిన బలిజ విజయ్‌కుమార్, ఇటుకలపల్లికి చెందిన బోయ నందిని ప్రేమ వివాహం చేసుకున్నారు. కాగా, ఆమెకు ఇది రెండో వివాహం, విజయ్‌కుమార్‌కు మొదటి పెళ్లి. ఏడాదిగా రాప్తాడులోని బీసీ కాలనీలో నివాసముంటున్నారు. ఈ క్రమంలో నందిని ప్రవర్తనపై అనుమానాలు పెంచుకున్న విజయ్‌కుమార్ రోజూ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని ఆమెతో గొడవపడేవాడు. సోమవారం రాత్రి విచక్షణారహితంగా నందినిపై దాడి చేయడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న నందినిని సర్వజనాస్పత్రికి తరలించారు. విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం సాయంత్రం నందిని మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

పాలస్తీనాకు అండగా నిలవాలి



పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దమనకాండ అత్యంత దుర్మార్గమని సీపీఎం నాయకులు అన్నారు. పాలస్తీనాకు అన్నిదేశాలు అండగా నిలవాలన్నారు. ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకిస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం స్థానిక క్లాక్‌టవర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ ం అత్యంత అమానుషచర్య అన్నారు. ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటికే 60 వేల మందికిపైగా పాలస్తీనీయులు చనిపోయారన్నారు. నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, ఇర్ఫాన్, మసూద్, బాలకృష్ణ, రాజు, శీనా, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

కవితా పోటీల విజేత గోవిందరాజులు



గోవిందరాజులు

అనంతపురం కల్చరల్: ఆర్డీటీ వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్ జయంతి సందర్భంగా తెలుగు వెలుగు సాహిత్య సంస్థ నిర్వహించిన కవితాపోటీల్లో అనంత కవి సొరపు గోవిందరాజులు విజేతగా నిలిచాడు. పోటీల వివరాలను నిర్వాహకుడు టీవీరెడ్డి మంగళవారం వెల్లడించారు. విజయవాడకు చెందిన బాచిరాజు సత్యనారాయణ, అనంతకే చెందిన పీజీ వెంకటేష్ తృతీయ బహుమతిని దక్కించుకోగా, వాడాల చంద్రశేఖరరావు (విశాఖపట్నం), గంగాధర్ (హిందూపురం), పెండేకంటి పార్థసారధి(అనంతపురం), పులి జమున (మహబూబ్ నగర్), వైరాగ్యం ప్రభాకర్ (కరీంనగర్) ప్రత్యేక బహుమతులకు ఎంపికయ్యారని తెలిపారు. పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన ఏలూరు యంగన్నకు ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు.

స్కేటింగ్‌లో సత్తా



తేజశ్విణి

అనంతపురం: స్కేటింగ్‌లో ఐదేళ్ల చిన్నారి ఏకంగా రెండు బంగారు పతకాలను దక్కించుకుంది. నగరంలోని కమలానగర్‌కు చెందిన శారద, శివరామ దంపతుల కుమార్తె తేజశ్విణి స్కేటింగ్‌లో సత్తా చాటింది. ఈ నెల 12న స్టేట్ జోనల్ ర్యాంకింగ్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ -2025 జోన్-1 పోటీలు తిరుపతిలో జరిగాయి. స్పీడ్ స్కేటింగ్ కొడస్ విభాగంలో ప్రతిభ ప్రదర్శించి రెండు విభాగాల్లోనూ బంగారు పతకాలు కైవసం చేసుకుంది. కోచ్‌లు చిన్నారి తేజస్వీణిని అభినందించారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం

అనంతపురం టవర్‌క్లాక్: మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి విమర్శించారు. మంగళవారం స్థానిక టవర్‌క్లాక్ సమీపంలో గాంధీ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో మహిళలపై అత్యాచారాలను ఖండిస్తూ నిరసన తెలియజేశారు. సాకే హరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలు, బాలికలపై దాడులను అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గంలో మహిళను చెట్టుకు కట్టేసి దాడులు చేశారని, రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని బహిరంగంగా అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నేతలు సుగమంచి శ్రీనివాసులు, కేపీ రాజు, గోవర్ధన్, రామకృష్ణ, సురేంద్ర, నారాయణ స్వామి, వేణుగోపాల్, గణేష్ ఉన్నారు.

నూతన విద్యావిధానంతో సమూల మార్పులు



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు, మాజీ వీసీ ప్రొఫెసర్ వై. నరసింహులు

అనంతపురం: నూతన జాతీయ విద్యా విధానంతో సమూల మార్పులు రానున్నాయని రాయలసీమ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వై. నరసింహులు అన్నారు. మంగళవారం జేఎన్‌టీయూ అనంతపురంలో జాతీయ విద్యా విధానం -2020కు సంబంధించి నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్‌పై ఒక్క రోజు అవగాహన సదస్సు నిర్వహించారు.

అనంతరం జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్ .సుదర్శనరావు మాట్లాడుతూ సాంకేతిక విద్యను మెరుగుపరచుకోవడం, ఉపాధ్యాయ శిక్షణా నైపుణ్యాలు పెంపొందించడం విద్యా విధానం లక్ష్యాలన్నారు. విద్యార్థులు వారి అభిరుచులకు అనుగుణంగా కోర్సులు ఎంపిక చేసుకునే సౌలభ్యాన్ని కల్పించాలని కోరారు. సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్ .కృష్ణయ్య, వర్సిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పార్కింగ్ తిప్పలు

- ఎమర్జెన్సీ వార్డు ముందే వందల వాహనాలు
- ఆస్పత్రి ప్రాంగణాన్ని ఆక్రమించిన అంబులెన్సులు, ఆటోలు
- పార్కింగ్‌కు పరిష్కారం చూపని అధికారులు



ఎమర్జెన్సీ వార్డు ముందు ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు, ఉద్యోగులకు పార్కింగ్ కష్టాలు తప్పడం లేదు. గత కొన్నేళ్లుగా ఈ సమస్య నెలకొన్నా.. శాశ్వత పరిష్కారం దిశగా ఎవరు చర్యలు తీసుకోవడం లేదు. ఆస్పత్రి ఆవరణలోని ఎమర్జెన్సీ వార్డు, తదితర ప్రాంతాల వద్దే వందల వాహనాలు ఉంటున్నాయి. తద్వారా అంబులెన్స్‌లు లోపలికి రావడానికి ఇబ్బందిగా మారింది. ప్రభుత్వ సర్వజనాస్పత్రికి రోజూ 10 వేల మంది వరకు రోగులు, వారి సహాయకులు, ఉద్యోగులు, తదితరులు వస్తుంటారు. ఇటువంటి ప్రాంతంలో పార్కింగ్‌కు సరైన స్థలం లేదు. అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాల్లో వాటర్ ప్లాంట్‌లు, విశ్రాంత భవనాల పేరుతో ఖాళీ చేస్తున్నారు. దీంతో పార్కింగ్‌కు అవకాశం లేకుండా పోయింది. ఇక ఆస్పత్రి వెనుకవైపు పార్కింగ్ స్థలం ఉన్నా.. అక్కడి వరకు వాహనాలు ఉంచలేని పరిస్థితి. క్యాజువాలిటీ, ఆర్థో, గైనిక్ షెడ్డు, పీజీ హాస్టల్ వద్ద వాహనాలను ఉంచుతున్నారు. ఈ క్రమంలో ప్రతి నెలా రెండు నుంచి మూడు వాహనాలు చోరీకి గురవుతున్నాయి. ఆస్పత్రికి వచ్చే వారిపై నిఘా ఉంచడంలో అటు ఔట్‌పోస్టు, సెక్యూరిటీ ఆశించిన స్థాయిలో విధులు నిర్వర్తించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాహనాలు నిలిపే వారు సైతం సెక్యూరిటీపై తిరగబడుతున్నారు. ఇటీవల భద్రత కమిటీ ఆస్పత్రిని తనిఖీ చేసి, ఆస్పత్రిలో భద్రతా ప్రమాణాలు ఏమాత్రం లేవని తేల్చి చెప్పారు. వందల సంఖ్యలో వాహనాలు ఉంచడం ద్వారా పొరపాటున ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే దేవుడే దిక్కు అని చెప్పాలి. రోగుల ప్రాణాలతో ముడి పడి ఉన్నా.. అటు కూటమి ప్రభుత్వం, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఆరు బయట ఆక్రమణ

ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు పార్కింగ్‌కు అనువైన అనుకూలం. కానీ అక్కడ ప్రైవేట్ అంబులెన్స్‌లు, తోపుడు బండ్లు నిర్వహిస్తున్నారు. ఆటో డ్రైవర్లు మరీ దారుణం. సంఘానికో ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేసుకుని ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రైవేట్ అంబులెన్స్‌లు, ఆటోలు అధిక ధరలతో ప్రజలను పీలి (పిప్పి) చేస్తున్నారు. తోపుడు బండ్ల నిర్వాహకులు రెండు, మూడు సెంటర్లను ఏర్పాటు చేసుకున్నారు. ఆస్పత్రి అధికారులు, నగరపాలక సంస్థ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి కూత వేటు దూరంలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే మిగితా ప్రాంతాల్లో పరిస్థితేంటో చెప్పాలని ఆస్పత్రి వర్గాలు అంటున్నాయి.

ప్రకృతి సంరక్షణతోనే మానవాళి మనుగడ



ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండిన పంటలను పరిశీలిస్తున్న డాక్టర్ వైవీ మల్లారెడ్డి

అనంతపురం: ప్రకృతి సంరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డాక్టర్ వై.వీ.మల్లారెడ్డి అన్నారు. ఎఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో పంగల్ రోడ్డు వద్ద ఉన్న ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ హైస్కూల్ ఆవరణలో ప్రపంచ కరువు, ఎడారి నివారణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వైవీ మల్లా రెడ్డి మాట్లాడుతూ ప్రకృతికి మానవుడు యజమాని కాదని.. ధర్మకర్త అని పేర్కొన్నారు. ప్రకృతిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందన్నారు. ప్రకృతిలో అసమతుల్యత ఏర్పడటం ద్వారా నేడు అనేక విపత్కర పరిస్థితులు ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వీటిని అరికట్టడానికి వీలుందన్నారు. ఆ దిశగానే ఎఎఫ్ ఎకాలజీ పనిచేస్తోందని వివరించారు. డీఆర్‌ఓ మలోల మాట్లాడుతూ కోవిడ్ అనంతరం ప్రజల ఆరోగ్యం పట్ల అప్రమత్తత పెరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇచ్చిన సందేశాన్ని ఆయన చదివి వినిపించారు. వాతావరణ మార్పులు, ఎడారి నివారణ కింద ఎఎఫ్ ఎకాలజీ చేస్తున్న కృషిని అభినందించారు. వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్ట్ విజయ శంకరబాబు మాట్లాడుతూ.. హరిత విప్లవం తరువాత దిగుబడులు పెంచే క్రమంలో పెద్ద ఎత్తున రసాయనాల వాడకం పెరిగిందన్నారు. రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ లక్ష్మానాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను రైతులకు తెలియజేస్తున్నామన్నారు. రెడ్స్ డైరెక్టర్ భానుజ, డీహెచ్‌ఓ సుబ్రమణ్యం, ఏఆర్ఎస్ సైంటిస్ట్ మాధవీలత, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలి



కళాశాలలో విక్రయిస్తున్న పుస్తకాలు, యూనిఫాంను చూపిస్తున్న ఏబీవీపీ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఖాజానగర్‌లోని నారాయణ బాలికల జూనియర్ కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్నారన్నారు. మంగళవారం ఏబీవీపీ నాయకులు అడ్డుకున్నారు. నారాయణ విద్యాసంస్థల అధినేత నారాయణను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నారాయణ కళాశాలలను వ్యాపార కేంద్రాలుగా మార్చారన్నారు. పుస్తకాల విక్రయ సమాచారాన్ని ఫోన్ ద్వారా ఆర్‌ఐఓ దృష్టికి తీసుకెళ్లారు. తాను అందుబాటులో లేనని వచ్చిన తర్వాత పరిశీలించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు దివాకర్ నాయక్, విజయ్, నగర కార్యదర్శి భరత్ రెడ్డి, శ్రీకాంత్, గణేష్, హరి ప్రసాద్ నాయక్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్నా పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు, రైతులు

అనంతపురం అర్బన్/శింగనమల: పెన్నా నది పరివాహక ప్రాంతం నుంచి భారీ స్థాయిలో జరుగుతున్న ఇసుక అక్రమ తరలింపులను అడ్డుకోవాలని పెన్నా పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఇసుక అక్రమ తరలింపు అరికట్టాలంటూ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, ఇతర నాయకులు మాట్లాడారు. శింగనమల, పెద్దవడుగూరు, గార్లదిన్నె మండలాల పరిధిలోని పెన్నా నది పరివాహక ప్రాంతంలోని రాచేపల్లి, నిదనవాడ, తరిమెల, గోపురాజుపల్లి, చిత్రచేడు, కల్లమడి, ఇల్లూరు గ్రామాలకు సాగు, తాగునీరు అందుతోందన్నారు. ఇసుక మేటల తొలగింపు పేరుతో పెన్నానది మధ్యలో నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా వందల సంఖ్యలో ట్రక్కుల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తునారన్నారు. దీనికి అడ్డుకట్ట వేయకపోతే పెన్నా పరివాహక ప్రాంతంలో బోర్లు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసేందుకు నాయకులు ప్రయత్నిస్తే కలెక్టర్ ప్రెస్‌క్లబ్ వద్ద ఓ కార్యక్రమంలో ఉన్నారని తెలుసుకుని అక్కడకు వెళ్లి ఆయనకు వినతి పత్రం అందజేసి పరిస్థితి వివరించారు. వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ అనుబంధ రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు, పెన్నా పరివాహక ప్రాంత రైతులు తరిమెల నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, బాలరంగయ్య, చిరుతల మల్లికార్జున, చిన్నప్పయాదవ్, భాస్కర్, తరిమెల భాస్కర్‌రెడ్డి, రమణ, సుధీర్, రంగారెడ్డి, సంగప్ప, నారాయణరెడ్డి, సత్యనారాయణ, గోవర్ధన్, కోటి, బాలిరెడ్డి పాల్గొన్నారు.

సజావుగా మండల మీట్

రాప్తాడురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో అనంతపురం రూరల్ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ హాజరయ్యారు. అనంతపురం అర్బన్ పరిధిలోని 4 పంచాయతీల అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే మాట్లాడారు. పంచాయతీల్లో స్టాంప్ డ్యూటీ జమ కాలేదంటూ సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వివిధ సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు. జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, మండల ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, ఎంపీడీఓ దివాకర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలపై దాడి హేయం

ఆత్మకూరు: సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలోనే మహిళపై దాడి చేయడం హేయమని ఎంపీపీల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు, ఆత్మకూరు ఎంపీపీ సుబ్బర హేమలత పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. హోం మంత్రి మహిళ అయినప్పటికీ మహిళలపై ఇలా వరుసగా దాడులు జరుగుతుంటే ఎలా చర్యలు తీసుకోక పోగా రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపించడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. కుప్పంలో ఓ మహిళను దారి వెంట ఈడ్చుకుంటూ వెళ్లి చెట్టుకు కట్టేసి కొడుతూ హింసించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు.

హైవేపై లారీలు ఢీ



రోడ్డు ప్రమాద దృశ్యం

అనంతపురం : జాతీయరహదారిపై రెండు లారీలు ఢీకొన్నాయి. మంగళవారం రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ సరిగ్గా నగరంలోని డీమార్ట్ సమీపంలోకి రాగానే ముందు టైరు బరెస్ట య్యింది. దీంతో వేగం తగ్గించి సైడ్ నిలిపేందుకు ప్రయత్నించాడు. ఇంతలో వెనకే వేగంగా వస్తున్న కంటైనర్ లారీ వేగాన్ని అదుపుచేయలేక ముందు వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో పెద్ద శబ్దం వచ్చింది. కంటైనర్ లారీ ముందు వైపు ఎడమ భాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ప్రాణాపాయం జరగలేదు. కంటైనర్ లారీ డ్రైవర్, క్లీనర్‌ను నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

'తల్లికి వందనం'లో అర్హులకు అన్యాయం



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌యాదవ్

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఏడాది తర్వాత అమలు చేసిన తల్లికి వందనం పథకంలో అర్హులకు అన్యాయం జరిగిందని, లక్షలాది మంది విద్యార్థులకు కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపిందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ అమ్మఒడి పథకం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందించారన్నారు. రాష్ట్రంలో 87,41,885 మంది విద్యార్థులున్నారని అందులో 30 లక్షల మందికిపైగా విద్యార్థులకు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ఎగ్గొట్టిందన్నారు. ప్రభుత్వం యూడైస్ విద్యార్థుల సంఖ్య ప్రకారం 13,112 కోట్లు కేటాయించాలని, కానీ ఇచ్చింది రూ.8,745 కోట్లు మాత్రమేనని తెలిపారు. తిరుపతి, నంద్యాల, ప్రకాశం జిల్లాలోని కొన్ని స్కూళ్లలో ఒక్కరికి కూడా పథకం వర్తింపజేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థులకు తల్లికి వందనం, ఫీజురీయింబర్స్‌మెంట్ అందించాలని లేనిపక్షంలో దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి అశోక్, నితిన్, నగరాధ్యక్షులు కై లాష్, ప్రధాన కార్యదర్శులు ఫయాజ్, రాహుల్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, గౌస్, బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం మీడియా

- నేనూ జర్నలిస్టు కుటుంబ సభ్యుడినే
- జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టవర్‌క్లాక్: ప్రజా స్వామ్యంలో కార్యనిర్వహక, న్యాయవ్యవస్థ, శాసన వ్యవస్థలతోపాటు మీడియా నాలుగో స్తంభమని కలెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టు పిల్లలకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కలెక్టర్ వినోద్‌కుమార్‌తో పాటు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ, పీవీకేకే విద్యాసంస్థల చైర్మన్ పల్లె వెంకటకృష్ణకిశోర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాత్రికేయుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలల్లో ఫీజు రాయితీ ఇచ్చే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. తమ తండ్రి చిత్రదుర్గంలో రిపోర్టర్‌గా పనిచేశారని, తాను కూడా జర్నలిస్టు కుటుంబ సభ్యుడినేనన్నారు. జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీ విషయంలో ప్రొసీడింగ్స్ ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జర్నలిస్టు నాగరాజు పిల్లలను ఉచితంగా చదివిస్తామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నాయకులు షఫీవుల్లా, రేపటి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం సిటీ: స్థానిక నేషనల్ పార్క్ వద్ద మంగళవారం రైలు కింద పడి ఓ గుర్తు తెలియని ఓ వ్యక్తి(50) ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకుని పరిశీలించారు. రైలు దూసుకెళ్లడంతో శరీరం రెండు ముక్కలైంది. మృతుడు తెలుపు రంగు షర్ట్, బ్రౌన్ కలర్ ఫ్యాంట్ ధరించాడు. మృతదేహాన్ని సర్వజనాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గంట వ్యవధిలో చిన్నారి అప్పగింత



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ జగదీష్

అనంతపురం: హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేక అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయిన 12 ఏళ్ల చిన్నారిని గంట వ్యవధిలో కనుగొని నాలుగో పట్టణ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. అజయ్ ఘోష్ కాలనీకి చెందిన బొమ్మలాట మౌక్షిత (12) మంగళవారం ఉదయం 7:30 గంటల సమయంలో హాస్టల్‌కు పంపుతున్నారని తల్లిదండ్రులపై అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కొంత సేపటికే తల్లిదండ్రులు గాలించారు. ఫలితం లేకపోవడంతో నాలుగో పట్టణ పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేశారు. సీఐ జగదీష్ వెంటనే స్పందించి రెండు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల పరిశీలన, ముమ్మర గాలింపు చర్యలతో నందమూరినగర్‌లో ఉన్న చిన్నారి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ జగదీష్ , సిబ్బందికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సురేష్ మాస్టర్‌కు ఆర్ట్ మ్యాస్ట్రో అవార్డు

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన అరవింద నృత్యశిక్షణాలయం వ్యవస్థాపకులు నాట్యాచార్యులు సురేష్‌కు ఆర్ట్ మ్యాస్ట్రో పురస్కారం అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఇంటర్నేషన్ డాన్సు ఫెస్టివల్‌లో సురేష్ శిష్యబృందం చేసిన శాస్త్రీయ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నారు. అనంతరం సురేష్ మాస్టర్‌ను నిర్వాహకులు అవార్డుతో ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ పండితులు దైవజ్ఞశర్మ చేతుల మీదుగా చిన్నారులకు జ్ఞాపికలందించారు.

గ్యాంగ్‌వార్: పలువురిపై కేసు నమోదు

అనంతపురం:నగరంలోని నాలుగో రోడ్డులో పలువురు యువకులు గ్యాంగ్ వార్‌కు పాల్పడ్డారు. దీంతో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ సీఐ కే. శాంతిలాల్ తెలిపారు. బుధవారం రాత్రి ఇమ్రాన్, సల్మాన్, దాదా గ్యాంగ్‌కు, గణేష్, పార్థ సారథి అలియాస్ పార్థ గ్యాంగ్‌లు పరస్పరం దాడి చేసుకున్నారు. ఇరు వర్గాల వారిపై చర్యలు తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రాప్తాడు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మంగళవారం లక్ష్మీ పండమేటి వెంకటరమణస్వామి దేవస్థానం సమీపంలోని పార్కులో యోగాంధ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే, అధికారులు, సచివాలయ ఉద్యోగులు యోగాసనాలు చేశారు.

గతేడాది లక్ష్యాలు నెలాఖరులోపు పూర్తి చేయాలి

అనంతపురం అగ్రికల్చర్: గతేడాది నిర్దేశించిన లక్ష్యంలో మిగులు ఉన్న వాటిని ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తే వచ్చే నెల నుంచి తాజా నిబంధనల ప్రకారం డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ అమలు చేయాల్సి ఉంటుందని ఉద్యానశాఖ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం ఆయన గుంటూరు నుంచి అడిషినల్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లుతో కలసి ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఏపీడీ ధనుంజయ, డీసలోలు, ఎంఐ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

వైఎస్ జగన్‌తో భేటీ



వైఎస్ జగన్‌ను కలిసిన వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్

అనంతపురం మెడికల్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విజయవాడలో వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వక్ఫ్‌బోర్డు సభ్యులతో అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 40 నిమిషాల పాటు మాట్లాడారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచించారు. వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసేలా చర్యలు తీసుకున్నందుకు అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఏఎంవీఐపై దురుసు ప్రవర్తన

అనంతపురం సెంట్రల్: విధి నిర్వహణలో ఉన్న రవాణాశాఖ అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌పై ఓ ట్రక్కు డ్రైవర్ దురుసుగా వ్యవహరించిన ఘటన మంగళవారం రాత్రి మరూరు టోల్‌గేట్ వద్ద చోటు చేసుకుంది. అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కేవీఎల్ఎన్ ప్రసాద్ మంగళవారం రాత్రి మరూరు టోల్‌గేట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర నుంచి బెంగూళూరుకు ఐరన్‌లోడ్‌తో వస్తున్న లారీని ఆపి రికార్డులను చూపించాలని ఆదేశించారు. తమిల్ అనే సదరు ట్రక్కు డ్రైవర్ రికార్డులు చూపించకపోగా దురుసుగా వ్యవహరించాడు. ఇష్టానుసారంగా మాట్లాడుతూ రెచ్చిపోయాడు.లారీకి జరిమానా విధించి చివరకు ట్రక్కును వదిలిపెట్టినట్లు అధికారులు తెలిపారు.

బదిలీల్లో తప్పిదాలను సవరించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: వెబ్ కౌన్సెలింగ్ బదిలీల్లో జరిగిన తప్పిదాలను సవరించాలని ఎస్టీయూ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం డీఈఓ ఎం.ప్రసాద్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్. రామాంజనేయులు, మున్సిపల్ ఉపాధ్యాయుల యూనియన్ రాష్ట్ర కన్వీనర్ ఫణి భూషణ్ మాట్లాడుతూ గుంతకల్లు ఎస్టేపీ పాఠశాల పీఎస్ టీచరు స్పౌజ్ కేజీబీవీలో పని చేస్తున్నట్లు ఆప్షన్ ఇవ్వడంతో ఆ పాఠశాల అలాట్ అయిందన్నారు. ఎస్జీటీల మాన్యువల్ కౌన్సెలింగ్‌లో జిల్లా అధికారులు, అబ్జర్వర్ సూచనల మేరకు కేజీబీవీల్లో పని చేస్తున్న కొన్ని కేడర్ల వారికి స్పౌజ్ వర్తించదంటూ ఆ పాయింట్లు తీసేసి జనరల్‌లో అవకాశం కల్పించారన్నారు. స్కూల్ అసిస్టెంట్ల విషయంలో వర్తింపచేసి జనరల్ వారికి అన్యాయం చేశారన్నారు. గుత్తిలో పనిచేసే ఎస్ఏ పీడీ ప్రిఫరెన్సియల్ కేటగిరిలో దరఖాస్తు చేసుకున్నాడని, ఆప్షన్స్ ఇచ్చే సమయంలో జనరల్ కేటగిరీలో కూడా ఆప్షన్స్ ఇచ్చి గుత్తి మండలం పెట్టాడన్నారు. ప్రిఫరెన్సియల్ కేటగిరీ కింద డి. హీరేహాళ్ మండలం సోమలాపురం పాఠశాలకు అలాట్ అయ్యారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆప్ట్ చేసిన గుత్తి మండలానికి అలాట్ చేయాలని కోరారు. మహిళా ఎల్‌పీటీ అభ్యర్థికి ఇంతవరకు ప్లేస్ అలాట్ కాలేదన్నారు. ఎస్జీటీల కౌన్సెలింగ్‌లో గుత్తి మండలం మామిడూరు యూపీ పాఠశాల కోరుకున్న ఉపాధ్యాయురాలికి ప్రభుత్వం నుంచి ఆర్డర్ వచ్చినా చేర్చుకోలేదన్నారు. నాయకులు ప్రభాకర్, నాయుడు, నాగభూషణ, మల్లికార్జున ఉన్నారు.



అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి ఎంపీటీసీ-2 సభ్యుడు సునీల్‌దత్తరెడ్డి మంగళవారం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని నివాసంలో కలిశారు. ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేయాలని అధినేత సూచించినట్లు సునీల్‌దత్త రెడ్డి తెలిపారు. - రాప్తాడురూరల్